నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 23 జూన్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

నా పేరు మానెపల్లి పోసుబాయి. నార్లపూర్ శివారులో మాకు ఐదెకరాల భూమి ఉంది. ఇందుకు సంబంధించిన రెవెన్యూ పట్టా కూడా ఉంది. ఇన్నాళ్లూ మా భూమిల్లోకి ఎవరూ అడుగుపెట్టలేదు. ఇప్పుడు అటవీశాఖ అధికారులు వచ్చి ఈ భూములు అటవీశాఖకు చెందినవని చెబుతున్నారు. సాగు చేయకుండా అడ్డుకుంటున్నారు. ఇదెక్కడి న్యాయం. మా భూములను అస్సలు వదులుకునేదే లేదు.



నా పేరు దేవాజీ. నార్లపూర్ శివారులో 5 ఎకరాల భూమి ఉంది. దీనికి రెవెన్యూ పట్టా కూడా ఉంది. అయినప్పటికీ అటవీ అధికారులు భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. నార్లపూర్, అంకుసాపూర్ గ్రామాల శివార్లలో దాదాపు 50 మంది రైతులకు 150 నుంచి 200 ఎకరాల వరకు రెవెన్యూ పట్టాలున్నాయి. అటవీ అధికారులు వచ్చి రెవెన్యూ పట్టాలున్న భూములను కూడా తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది సరికాదు.

అటవీ భూమి ఏదో.. రెవెన్యూ భూమి ఏదో తెలియక సతమతం

అటవీ భూములకు రెవెన్యూ పట్టాలు..!

అధికారులతో వాగ్వాదానికి దిగిన పట్టా ఉన్న రైతులు (ఫైల్)

- పరిష్కారం లేని సమస్యగా మరో వివాదం
- హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో రైతాంగానికి తప్పని తిప్పలు
- పట్టాలున్న భూముల్లో సాగును అడ్డుకుంటున్నారని ఆవేదన
- 9 వేల మందికి పైగా ఇలాంటి పట్టాలే ఉన్నట్లు అంచనా

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో అటవీ భూములేవో.. రెవెన్యూ భూములేవో.. తెలియక అధికారులకు తలనొప్పిగా మారగా.. ఇటు సాగు పనుల్లో నిమగ్నమైన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా అటవీ భూములు-రెవెన్యూ భూముల మధ్య హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో రైతాంగం అడ్డంకులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. కాగజ్‌నగర్‌లోని అంకుసాపూర్ శివారులో ఏళ్లకేళ్లుగా భూములు సాగు చేసుకుంటున్న రైతులకు రెవెన్యూ శాఖ రెండు మూడేళ్ల క్రితం పట్టాలు జారీ చేసింది. అయితే గత గురువారం ఆ భూముల్లో రైతులు సాగు చేసుకుంటుండగా, అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. రెవెన్యూ శాఖ జారీ చేసిన పట్టాలను అటవీ అధికారులకు చూపిస్తూ వారితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయమై అధికారులకు స్పష్టత లేకపోవడంతో గొడవకు దారితీసినట్లు తెలుస్తున్నది. జిల్లాలోని అటవీ భూములకు దాదాపు 9 వేలకు పైగా రెవెన్యూ శాఖ ద్వారా పట్టాలు జారీచేసినట్లు సమాచారముండగా, అన్ని చోట్ల ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తున్నది.

అటవీ- రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం..

జిల్లాలో అటవీ-రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం రైతులకు శాపంగా మారుతున్నది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సుమారు 21,753 ప్రాంతాల్లో అటవీ-రెవెన్యూ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు ఉన్నాయి. దాదాపు 90 వేల ఎకరాల అటవీ భూములు ఆక్రమణకు గురైనట్లు అటవీ అధికారులు గుర్తించారు. జిల్లాలో దాదాపు ఈ అటవీ భూములకు రెవెన్యూ అధికారులు సుమారు 9 వేల మందికి పైగా రైతులకు పట్టాలు జారీచేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ ఏర్పాటు చేయడంతో ఆక్రమణల్లో ఉన్న అటవీ భూములను స్వాధీనం చేసుకునేందుకు అటవీ శాఖ చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా గిరిజనేతరుల సాగులో ఉన్న సుమారు 90 వేల ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. పోడు వ్యవసాయం చేసుకుంటూ హక్కు పత్రాలను పొందిన గిరిజన రైతులను మినహాయించి మిగతా వారి ఆక్రమణల్లో ఉన్న అటవీ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలుచేపడుతున్నారు. ఈ క్రమంలో కాగజ్‌నగర్ మండలం నార్లపూర్, అంకుసాపూర్ గ్రామాల్లో గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న అటవీ భూముల్లోనికి వెళ్లిన అధికారులకు కొత్త సమస్య ఎదురైంది. ఇక్కడ రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న అటవీ భూములకు రెవెన్యూ శాఖ గతంలోనే పట్టాలు ఇవ్వగా, ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ పథకాలను కూడా పొందుతున్నారు. పట్టాలు పొందిన సాగు భూముల్లోకి వచ్చి అటవీ అధికారులు అడ్డుకోవడం పెద్ద వివాదంగా మారుతోంది.

200 ఎకరాలకు పట్టాలు

కాగజ్‌నగర్‌లోని అంకుసాపూర్, నార్లపూర్ గ్రామాల పరిధిలో దాదాపు 50 మంది రైతులకు 200 ఎకరాల వరకు గతంలో రెవెన్యూ శాఖ ద్వారా పట్టాలు ఇచ్చారు. పట్టాలు పొందిన రైతులు చాలా ఏళ్లుగా సాగులో ఉన్నారు. గత ప్రభుత్వం ధరణి తీసుకువచ్చిన తర్వాత వీరికి పట్టాలు అందాయి. ఇప్పుడు ఈ భూములు అటవీ శాఖ తమదని వాదిస్తోంది. అటవీ శాఖకు చెందిన ఈ భూములను రైతుల నుంచి స్వాధీనం చేసుకునేందుకు అటవీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో మొక్కలు నాటేందుకు ప్రయత్నిస్తున్నారు. గురువారం ఈ ప్రాంతంలో సాగులో ఉన్న రైతులను అడ్డుకునేందుకు అటవీ అధికారులు ప్రయత్నించడంతో రైతులు అటవీ అధికారులపై తిరగబడ్డారు. దీంతో చేసేదేమి లేక అటవీ అధికారులు వెనుదిరిగారు.

దేవాపూర్‌లో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తాగు నీటికి తండ్లాడుతున్నా పట్టదా?

దేవాపూర్‌లో ఖాళీ బిందెలతో మహిళల నిరసన

తాగు నీటి కోసం తండ్లాడుతున్నా పట్టించుకోరా.. అంటూ కాసిపేట మండలం దేవాపూర్‌కు చెందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మాదిగ హక్కుల దండోర ఆధ్వర్యంలో ఆదివారం దేవాపూర్‌లోని ప్రధాన రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. పక్షం రోజులుగా గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి తాగు నీరందించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోర మండల అధ్యక్షుడు అట్కుపురం రమేశ్, మహిళలు జయ, నర్సమ్మ, పుష్పలత, స్వప్న, లావణ్య, రజిని, కుంద, జ్యోతి, రాజమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

- కాసిపేట, జూన్ 22

అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

25 ఏళ్లకు ఒకేచోట చేరి..

కాగజ్‌నగర్ మండలం చింతగూడ జడ్పీఎస్ఎస్‌లో 1999-2000లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకేచోట చేరి సందడి చేశారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకొని సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు పూర్ణచందర్‌రావు, రాజారాం, షేక్ మహబూబ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

- కాగజ్‌నగర్, జూన్ 22

జనగామ రూట్‌లో బస్సు నడిపించాలని మంత్రి వివేక్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

బస్సు ఆగుతలేదు

చెన్నూర్ నుంచి సిరొంచ-కాళేశ్వరం రూట్‌లో నడిచే బస్సులు మా బస్టాప్ వద్ద ఆగుతలేవు. గతంలో ప్రతి పల్లెవెలుగు బస్సు మా స్టేజ్ వద్ద ఆగేది. ఇప్పుడు పాత పల్లెవెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు పెట్టి మా బస్టాప్ వద్ద ఆపకుండా చేస్తున్నరు. ఎక్స్‌ప్రెస్ బస్సులను కొత్తవి ఏర్పాటు చేయకుండా పల్లెవెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు పెట్టడం ఎంతవరకు సమంజసం. చెన్నూర్ నుంచి కొల్లూరు, సిరొంచ-కాళేశ్వరం కోసమే ఆర్టీసీ అధికారులు బస్సులు నడుపుతున్నట్లు ఉంది.

-ఆసంపల్లి లక్ష్మీ, లక్ష్మీపూర్

బస్సు మళ్లీ రద్దు చేశారు

చెన్నూర్ నుంచి జనగామ రూట్‌లో నడిచే బస్సును ఆర్టీసీ అధికారులు మాటిమాటికీ రద్దు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఫ్రీబస్సు పేరుకే కానీ.. బస్సులు మా రూట్‌లో సక్రమంగా నడిపింది లేదు. గతంలో నెలలకొద్దీ బస్సును నడిపించలేదు. మధ్యలో కొన్ని రోజులు నడిపించారు. ఇప్పుడు మళ్లీ రద్దు చేశారు. ఇప్పటికైనా మంత్రి వివేక్ సార్ మా ప్రాంత ప్రయాణికులు, మహిళల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బస్సు సర్వీస్‌ను నడిపించేలా కృషి చేయాలి.

- శనిగారం గౌరక్క (రొయ్యలపల్లి)

మంత్రివర్యా.. మాకొద్దా మహాలక్ష్మి?

- జనగామ రూట్‌లో మళ్లీ నడవని ప్రగతి రథ చక్రం
- వివేక్.. మినిస్టర్ అయిన తర్వాత బ్రేక్ చేయడంపై విమర్శలు
- ఇబ్బందులు పడుతున్న 10 గ్రామాల ప్రజలు, విద్యార్థులు
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం
- సిరొంచ-కాళేశ్వరం రూట్‌లో బస్సుల కుదింపుతో ప్రయాణికుల అవస్థలు

చెన్నూర్ నియోజకవర్గంలో పలు గ్రామాలకు తగ్గుతున్న ఆర్టీసీ సేవలు

కోటపల్లి, జూన్ 22 : మహాలక్ష్మి పథకం ద్వారా పల్లె పల్లెకూ ఆర్టీసీ సేవలందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న సర్కారు.. ఆచరణలో మాత్రం విఫలమవుతున్నది. ఆయా రూట్లలో ఆర్టీసీ బస్సులతో పాటు ట్రిప్పులనూ తగ్గిస్తుండగా, ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తున్నది. ప్రధానంగా వివేక్ మంత్రిగా ఉన్న నియోజకవర్గంలోని కోటపల్లి మండలంలో సగానికి పైగా గ్రామాలు నేటి వరకూ బస్సులకు నోచుకోకపోగా, మరోవైపు బస్సులు నడుస్తున్న రూట్లలో సేవలు తగ్గిస్తుండడం విమర్శలకు తావిస్తున్నది.

జనగామ రూట్‌లో నిలిచిన ఆర్టీసీ సేవలు

కోటపల్లి మండలం జనగామ గ్రామానికి ప్రతి రోజూ ఉదయం.. సాయంత్ర ఆర్టీసీ బస్సు నడిచేది. గతంలో ఈ రూట్‌లో రోడ్డు బాగున్నా.. ఏవేవో సాకులు చెప్పి ఆర్టీసీ బస్సును రద్దు చేశారు. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ' ప్రముఖంగా కథనాలు ప్రచురించడంతో స్పందించిన ఆర్టీసీ.. బస్సు సేవలను పున:రుద్ధరించింది. గతంలో జనగామ రూట్‌లో బస్సులు నడిపించండి సారూ.. అంటూ చెన్నూర్ ఎమ్మెల్యే (ప్రస్తుత మంత్రి) వివేక్‌కు ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులే స్వయంగా మొరపెట్టుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఇదే మార్గంలో వారం నుంచి బస్సు సేవలు నిలిపి వేయడంతో పారుపల్లి, లిగన్నపేట, ఎదుల్లబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, ఆలుగామ, జనగామ, సూపాక, నందరాంపల్లి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఈ రూట్‌లో ఆర్టీసీ సేవలు రద్దు చేసి ప్రైవేట్ ప్రయాణాన్ని పోత్సహిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. జనగామ రూట్‌లో బస్సు సేవలు లేకపోవడంతో సిర్సా, పారుపల్లికి చెందిన విద్యార్థులు కాలినడనక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సి వస్తున్నది. మంత్రి గడ్డం వివేక్ ప్రాతినిధ్యం వహిస్తున్న జనగామ రూట్‌లో బస్సులు నడిపించాలని సిర్సా గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు శుక్రవారం చెన్నూర్‌లో బస్టాండ్‌లోని ఆర్టీసీ సిబ్బందికి వినతి పత్రం ఇచ్చారు.

గతంలో జనగామ గ్రామానికి వచ్చిన బస్సుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు (ఫైల్)

సిరొంచ-కాళేశ్వరం రూట్‌లో తగ్గిన ట్రిప్పులు

చెన్నూర్ నుంచి సిరొంచ-కాళేశ్వరం రూట్‌లలోనూ అధికారులు సర్వీస్ ట్రిప్పులను తగ్గించారు. ఇక పల్లెవెలుగు బస్సులకు.. ఎక్స్‌ప్రెస్ బస్సులంటూ బోర్డులు పెట్టి నడిపిస్తూ ప్రయాణికులపై భారం మోపుతున్నారు. నిత్యం ఈ మార్గం రద్దీ ఉండేది కాగా.. ఆర్టీసీ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపూ విమర్శలు వస్తున్నాయి. పల్లెవెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బస్సు బోర్డులు పెట్టి నడిపిస్తుండడం వల్ల ఈ బస్సు కోటపల్లి మండలం కొల్లూరు బస్ స్టాప్‌లో మినహా ఎక్కడా ఆగడం లేదు. ఈ మార్గంలో చెన్నూర్ మండలంలోని చింతలపల్లి, అక్కెపల్లి, కోటపల్లి మండలంలోని పారుపల్లి బస్టాప్, ఎర్రాయిపేట, రాంపూర్, దేవులవాడ, బబ్బెరచెలుక, వెలమపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లో బస్సులు నిలుపడం లేదు. ఫలితంగా ప్రజలు అధిక చార్జీలు చెల్లించి ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఇకనైనా ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచడంతో పాటు ఎక్స్‌ప్రెస్ బస్సులుగా మార్చిన పల్లెవెలుగు బస్సులను తిరిగి పల్లెవెలుగు స్థానంలోనే కొనసాగించాలని, లేదంటే రోడ్డెక్కి ఆందోళన చేపడుతామని పారుపల్లి, ఎర్రాయిపేట, రాంపూర్, దేవులవాడ, బబ్బెరచెలుక, లక్ష్మీపూర్, వెలమపల్లి తదితర గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

అసెంబ్లీలో మాట్లాడినా బస్సు రాలే..

గతేడాది డిసెంబర్ 17న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో జనగామ, నక్కలపల్లి రూట్‌లతో పాటు హైదరాబాద్(ఉదయం)కు ఆర్టీసీ బస్సులు నడిపించాలని చెన్నూర్ ఎమ్మెల్యే (ప్రస్తుత మంత్రి) ప్రభుత్వాన్ని వివేక్ కోరారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఆపై వివేక్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఒక్క జనగామ రూట్‌లో మాత్రమే బస్సు నడిపించారు. ఆరు నెలల పాటు బస్సును నడిపిన ఆర్టీసీ అధికారులు.. ప్రస్తుతం వివేక్ మంత్రి అయిన సమయంలో ఆ బస్సు సేవలను నిలిపివేశారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నక్కలపల్లి గ్రామానికి ఇప్పటి వరకు బస్సు సర్వీస్ నడవకపోగా పంగిడిసోమారం, రాజారం, కావర కొత్తపల్లి, బొప్పారం, నాగంపేట, కొండంపేట, ఎసన్వాయి, ఎడగట్ట, పిన్నారం గ్రామాలు ఆర్టీసీ సేవలకు ఆమాడ దూరంలో ఉన్నాయి

మాకొద్దా మహాలక్ష్మి పథకం

మంత్రి వివేక్ సారూ.. మా ఊళ్లకు బస్సు వస్తలేదు. మహాలక్ష్మి పథకం మాకు వర్తించదా. ఇప్పటి దాకా బస్సులు నడిపించిన అధికారులు మా ఎమ్మెల్యే మంత్రి అయిన తర్వాత రద్దు చేయడం దారుణం. ఇకనైనా మా మంత్రి చొరవ చూపాలి.

- శనిగారం సత్యక్క, రొయ్యలపల్లి

పోనకల్ వెళ్లే తూమువద్ద కూలిపోయిన 13వ డిస్ట్రిబ్యూటరీ కాలువగోడ

మందపల్లి వద్ద 13వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో చెత్త,బండరాయి

22వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

కడెం కాలువలిలా.. పంటలకు నీరెలా!

అలీనగర్ సమీపంలో దెబ్బతిన్న కడెం ప్రధాన కాలువలైనింగ్

జన్నారం మండలం కామన్‌పల్లి, అలీనగర్, దేవునిగూడ, మందపల్లి, తిమ్మాపూర్, పోనకల్ తదితర గ్రామాల మీదుగా వెళ్లే కడెం ప్రధాన కాలువలు అధ్వానంగా మారాయి. పెద్ద పెద్ద బుంగలు పడి.. సిమెంట్ లైనింగ్ దెబ్బతిని.. పిచ్చిమొక్కలు పెరిగి.. చెత్తాచెదారంతో నిండి పంటలకు నీరందించలేని దుస్థితికి చేరాయి. ఈ యేడాది జన్నారం మండలంలోని 19వ-డీ, 22వ డిస్ట్రిబ్యూటరీ కాలువలపై ఆధారపడి 17,700 ఎకరాల్లో వరి వేస్తున్నట్లు అంచనా. ప్రస్తుతం సాగు పనులు ఊపందుకుంటుండగా, ఇప్పటి వరకు అధికారులు కాలువల మరమ్మతులపై దృష్టి సారించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా స్పందిస్తారో.. లేదో చూడాలి మరి..

- జన్నారం, జూన్ 22

కామన్‌పల్లి సమీపంలో దెబ్బతిన్న కడెం ప్రధాన కాలువలైనింగ్

దరఖాస్తుల ప్రక్రియ పూర్తి

20,258 దరఖాస్తులు వచ్చాయి : వీసీ

బాసర, జూన్ 22 : బాసర ఆర్జీయూకేటీలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంటిగ్రేటెడ్ కోర్సులో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ పూర్తి అయిందని ట్రిపుల్ఐటీ వీసీ గోవర్ధన్ తెలిపారు. బాసర, మహబూబ్‌నగర్ సెంటర్లలో మొత్తం 20,258 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరికి జూలై 4వ తేదీన అర్హులైన వారికి సీట్ల కేటాయింపు, ఫలితాల విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. తదుపరి జూలై 7వ తేదీ నుంచి మొదటి విడుత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నదన్నారు.